

# బియ్యం దందాలో ఆ నలుగురు!

- మిల్లర్లపై అజమాయిషీ
- మొదట వారి మిల్లులకు ధాన్యం.. తర్వాతే ఇతర మిల్లులకు సరఫరా
- ప్రారంభం కాని బాయిల్డ్ మిల్లుకు 40 వేల బస్తాలు కేటాయింపు
- కోట్లకు పడగలు
- సివిల్ సప్లయ్ కార్యాలయం అడ్డాగా కార్యకలాపాలు

గద్వాల, జూన్ 13 : ఏదైనా మిల్లుకు ధాన్యం కేటాయించాలంటే ముందుగా కలెక్టర్ అనుమతి తీసుకొని సివిల్ సప్లయ్ అధికారులు ఆయన ఆదేశానుసారంగా మిల్లులకు వడ్లు కేటాయించాలి.. కానీ ఇక్కడ అలాంటివి ఏవీ జరగవు.. గద్వాల జిల్లాలో ఆ నలుగురు ఏది చెబితే అదే వేదంగా భావించి అధికారులు ఫైనల్ చేస్తారు.. ఇక్కడ అధికారుల పాత్ర నామమాత్రంగా ఉంటుంది.. ఆ నలుగురు ఇచ్చే మామూళ్లకు ఆశపడి సివిల్ సప్లయ్ అధికారులు చిన్న, కొత్త మిల్లుల యజమానుల పొట్టగొడుతున్నారు.. ఆ నలుగురి అండ చూసుకొని వారితోపాటు కొంత మంది మిల్లుల యజమానులు 2022-2023 యాసంగికి సంబంధించి ప్రభుత్వం మిల్లులకు కేటాయించిన వరి ధాన్యం అమ్ముకున్నా ఎవరూ పట్టించుకోలేదు.

జోగుళాంబ గద్వాల జిల్లాలో సుమారు రూ.10 కోట్ల బియ్యం పక్కదారి పట్టినా అధికారులు కేసులతో సరి పెట్టారే తప్పా.. వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రూ.కోటి విలువ చేయని మిల్లులకు రెండు కోట్లకుపైగా విలువ చేసే ధాన్యం ఎత్తగా వారు దానిని అమ్ముకొని రూ.కోట్లకు పడగలెత్తారు. 2022 యాసంగికి సంబంధించి మిల్లర్లు బియ్యం ప్రభుత్వానికి ఇవ్వలేదని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించినా ఇక్కడి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. పక్కదారి పట్టిన వడ్లపై విచారణ చేయాలని పోలీస్ అధికారులకు ఉన్నతాధికారులు ఆదేశించగా వారిపై ఒత్తిడి తెచ్చి విచారణ కొనసాగకుండా చేశారు. జిల్లాలోని పలుకు బడిన కలిగిన కొంత మంది మిల్లర్లు ప్రభుత్వానికి సుమారు 100లారీల బియ్యం ఇవ్వాలని ఈ బియ్యం పక్కదారి పట్టిందని పోలీస్ నివేదికలో తేలినట్లు సమాచారం. అయితే ఆ విషయం బయటకు రాకుండా రాజకీయ నాయకులతో పోలీసులపై ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. చివరకు ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యానికి బదులు డబ్బులు చెల్లిస్తామని అవినీతికి పాల్పడ్డ మిల్లుల యజమానులు ఒప్పుకోగా అవి కూడా చెల్లించకుండా కాలయాప

## వారు చెప్పిందే వేదం

న చేస్తున్నట్లు తెలిసింది. జిల్లాలో ఆ నలుగురు చెప్పిందే వేదంగా సివిల్ సప్లయ్‌శాఖలో కార్యాకలాపాలు కొనసాగుతున్నాయి. ఈ యాసంగిలో జోగుళాంబ గద్వాల జిల్లాలో అనుకున్న స్థాయిలో ధాన్యం పండలేదు. అయితే తెలంగాణలో ని ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి అధికారులు ధాన్యం తెప్పించగా మిల్లులకు వాటిని కేటాయింపులో కూడా వారి పెత్తనం నడుస్తుండడంతో మిగతా మిల్లుల యజమానులకు ఏం చేయాలో పాలు పోవడం లేదు. గద్వాల జిల్లాకు మెదక్‌తోపాటు ఇతర జిల్లాల నుంచి 20వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మర ఆడించడానికి అనుమతించగా అందులో కూడా వీరి పాత్రే కీలకం. ఇతర జిల్లాల నుంచి వచ్చిన ధాన్యంలో అధికారులు ఇప్పటి వరకు అందులో 17వేల మెట్రిక్ టన్నులు మిల్లులకు కేటాయించగా ఇంకా మూడు వేల మెట్రిక్ టన్నులు మిల్లులకు కేటాయించకుండా అధికారులు కాలయాపన చేస్తున్నట్లు తెలిసింది.



మిల్లులో ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

## ప్రారంభం కాని మిల్లుకు ధాన్యం కేటాయింపు..

వాస్తవంగా ప్రస్తుతం నడుస్తున్న బాయిల్డ్ మిల్లులకు మాత్రమే ధాన్యం కేటాయించాలి. ఇక్కడి అధికారులు మాత్రం ఒక బాయిల్డ్ మిల్లు నిర్మాణ పనులు జరుగుతుండగానే ధాన్యం కేటాయింపులు చేశారు. అక్కడ ఒక్క గింజ కూడా మర ఆడించలేదు. పనులు పూర్తవుతాయో లేదో కూడా తెలియదు కానీ.. అటువంటి మిల్లుకు ఇక్కడి అధికారులు సుమారు 40వేల బస్తాలపైనే వరిధాన్యం మర ఆడించడానికి కేటాయించారంటే ఇక్కడ వారి ప్రాబల్యం ఎలా ఉందో ఇట్టే తెలిసిపోతున్నది. వాస్తవంగా కొత్త మిల్లులకు ధాన్యం కేటాయించే సమయంలో వారు మర ఆడించినట్లు కరెంట్ బిల్లుతో పాటు అధికారులు పరిశీలించిన తర్వాత అన్ని ఒకే అంటేనే ధాన్యం కేటాయింపులు చేయాలి. కానీ అధికారులు అవేవి పట్టించుకోకుండా కొన్ని రోజుల్లో మిల్లు పనులు పూర్తవుతాయని భావించి ధాన్యం కేటాయించినట్లు తెలిసింది. అధికారుల అండతో ఆ నలుగురు చేస్తున్న దందాలను అరికట్టి అందరికీ న్యాయం జరిగేలా చూడాలని కొత్త, చిన్న మిల్లుల యజమానులు కోరుతున్నారు.

## బియ్యం పాస్ చేసేదీ వారే..

ఆ నలుగురు మిల్లర్లు ఆడించిన బియ్యం పాస్ అంటే పాస్.. ఫెయిల్ అంటే ఫెయిల్ అనే స్థాయికి ఎదిగారు. ప్రభుత్వం మిల్లులకు ఇచ్చిన వరి ధాన్యం మర ఆడించిన తర్వాత వాటిని గోదాంకు తరలిస్తారు. గోదాం స్టాక్ పాయింట్ దగ్గర పాయింట్ అధికారి వాటిని పరిశీలించి పాస్ ఆర్ ఫెయిల్ అని చెప్పాలి. అయితే ఇక్కడ స్టాక్ పాయింట్ దగ్గర ఉండే అధికారి పాత్ర నామమాత్రం. ఒకవేళ బియ్యం లోడ్ పాస్ కాకపోతే ఆ మిల్లు యజమానికి సుమారు రూ.70వేల వరకు నష్టం వస్తుందని మిల్లు యజమానులు వాపోతున్నారు. ఆ నలుగురు మిల్లర్ల ధాన్యం, వారికి అనుకూలమైన మిల్లర్ల ధాన్యం స్టాక్ పాయింట్‌కు తీసుకొస్తే అవి మంచిగా ఉన్నా లేకున్నా పాస్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ వీరి మూలంగా కొత్త, చిన్న మిల్లుల యజమానులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తున్నది.

## కొత్త మిల్లుల యజమానులపై పెత్తనం..

వాస్తవానికి ప్రభుత్వం కొనుగోలు చేసిన వరి ధాన్యం జిల్లాలోని అన్ని మిల్లులకు సమానంగా సరఫరా చేయాలి. కానీ ఇక్కడ అలా జరగడం లేదు. ఎవరైతే ఆ నలుగురు ఉన్నారో మొదటి నుంచి వరి ధాన్యం వారి మిల్లులకు తరలించుకొని మిగతా మిల్లులకు నాణ్యత లేని ధాన్యం పంపుతున్నట్లు తెలిసింది. దీంతోపాటు ఆ నలుగురు మిల్లులకు ఎక్కువ ధాన్యం కేటాయింపులు అధికారులతో చేయించుకొని చిన్న మిల్లులకు తక్కువ వరి ధాన్యం కేటాయించడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల దృష్టికి ఈ విషయం తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని చిన్న మిల్లుల యజమానులు వాపోతున్నారు. అందరికీ సమానంగా ధాన్యం పంపిణీ చేయాలని వేడుకుంటున్నా వారి మాటలు పట్టించుకోకుండా వారిపై పెత్తనం చెలాయిస్తున్నట్లు తెలిసింది.



ఎమ్మెల్సీ నవీన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మహమూద్ అలీ, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

# నవీన్‌కు అభినందనల వెల్లువ

- స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం
- హాజరైన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు


మహబూబ్‌నగర్, జూన్ 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలుపొందిన బీఆర్ఎస్ నేత నవీన్‌కుమార్‌రెడ్డి గురువారం పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్సీతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన ఎమ్మెల్సీ వాణిదేవి, మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మహమూద్‌అలీ, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, అంజయ్యయాదవ్‌తోపాటు బీఆర్ఎస్ నాయకులు అభినందించారు. ఇటీవల మహబూబ్‌నగర్ శాసనమండలి ఉపఎన్నికల్లో నవీన్‌కుమార్ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డిపై భారీ మెజార్టీతో గెలుపొందారు. దీంతో కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్సీతో పదవీ ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో నవీన్‌కుమార్‌రెడ్డి సతీమణి లక్ష్మి ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

**రుణపడి ఉంటా : నవీన్‌కుమార్‌రెడ్డి**

తనను ఎమ్మెల్సీగా గెలిపించిన పాలమూరు ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులకు ఎల్లవేళలా రుణపడి ఉంటానని ఎమ్మెల్సీగా ఎన్నికైన నవీన్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. గురువారం 'నమస్తే తెలంగాణ' ప్రతినిధితో మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్‌రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధికి పాటుపడతానని స్పష్టం చేశారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి



బాధిత కుటుంబసభ్యులకు ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

# సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, జూన్ 13 : ప్రభుత్వం అందించే సాయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో గద్వాల పట్టణం వేదనగర్‌కు చెందిన శ్రీనివాసులుకు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.లక్ష ఎల్‌వోసీని బాధిత కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అనారోగ్యానికి గురై చికిత్స చేయించుకోలేని వారు సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకుంటే ఆర్థిక సాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నరహరి శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ ఈరన్‌గౌడ్, వేణు పాల్గొన్నారు.



ఉంద్యాల వద్ద కోయిల్‌సాగర్ ఫేజ్-1 మోటర్లు ప్రారంభించి పూలు చల్లుతున్న ఎమ్మెల్యేలు జీఎంఆర్, వాకిటి శ్రీహరి

# ప్రతి ఎకరాకూ సాగునీరందిస్తాం

మక్తల్, జూన్ 13 : ప్రతి ఎకరాకు సాగునీరు అందించి తెలంగాణను మాగాణిగా మార్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి అన్నారు. వానకాలం సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో కృష్ణానదికి వరద వస్తుండగా భీమా ఫేజ్-1కు సంబంధించి చిన్నగోప్లాపూర్ వద్ద, మక్తల్ తిరుమలయ్య చెరువుకట్ట వద్ద స్టేజ్-2 పంప్ హౌస్ మోటర్లను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకూ సాగునీరందించాలనే లక్ష్యంతో చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, భూత్పూర్ రిజర్వాయర్లను కృష్ణ నీటితో నింపేందుకు పంపింగ్ ప్రారంభించినట్లు తెలిపారు. 100 రోజులపాటు నీటిని ఎత్తిపోసి నియోజకవర్గంలోని ప్రతి మండలానికి సాగునీరు అందించి పాడిపంటలు పండేందుకు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ప్రతి రైతును ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని, ఇప్పటికే అన్ని మండలాల్లో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ అధికారులు వెంకటరమణ, నాగశివతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**రైతులను ఆదుకుంటాం**

- **ఎమ్మెల్యేలు జీఎంఆర్, వాకిటి శ్రీహరి**

దేవరకద్ర రూరల్(చిన్న చింతకుంట), జూన్ 13 : పాలమూరు జిల్లాలోని మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టు అయిన కోయిల్‌సాగర్ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించి రైతులను ఆదుకుంటామని దేవరకద్ర ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. గురువారం చిన్నచింతకుంట మండలం ఉంద్యాల వద్ద జూరాల నుంచి కోయిల్‌సాగర్ ఫేజ్ -1కు సంబంధించిన మోటర్లను ప్రాజెక్టు అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూరాలకు వరద చేరుతున్న సందర్భం గా సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు కోయిల్‌సాగర్‌ను నింపేందుకు ఉంద్యాల నుంచి ఫర్దీపూర్ జలాశయానికి ఫేజ్-1కు సంబంధించిన మోటర్లు ప్రారంభించి పంపింగ్ చేస్తున్నట్లు తెలిపారు. వెనుక జలాలను ముందస్తుగా తోడి కోయిల్‌సాగర్‌ను నింపుకొంటే కాల్వల ద్వారా ఆయకట్టుకు, గొలుసుకట్ట చెరువులను నింపుకొనే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ రౌడీల దాడులకు భయపడం

- బీసీబిడ్డను చైర్మన్‌గా దింపడంతోనే ఎమ్మెల్యే పతనం ఆరంభం
- అక్రమ కేసులు, భయాందోళనకు గురిచేసి కౌన్సిలర్లను చేర్చుకోవడం చేతగానితనం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు
- కాంగ్రెస్ పార్టీ అవిశ్వాసానికి వ్యతిరేకంగా అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం

అచ్చంపేట, జూన్ 13 : కాంగ్రెస్ పార్టీ గూండాలు, రౌడీలతో ఎమ్మెల్యే చేయిస్తున్న దాడులకు భయపడేదిలేదని వారి ఆగడాలను అడ్డుకుంటామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. ఉద్యమకారుడు, బీసీ బిడ్డ అయిన మున్సిపల్ చైర్మన్ నర్సింహాగౌడ్‌పై అవిశ్వాసం పెట్టి దింపడంతోనే అచ్చంపేటలో ఎమ్మెల్యే వంశీకృష్ణ పతనం ఆరంభమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసానికి వ్యతిరేకంగా అచ్చంపేటలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గువ్వల బాలరాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే వంశీకృష్ణకు బీఆర్ఎస్ నేతలు, కౌన్సిలర్లను భయపెట్టి, దాడులు చేసి, అక్రమ కేసులు బనాయించి, భయభ్రాంతులకు గురిచేసి పార్టీలో చేర్చుకోవడానికి సిగ్గుండాలన్నారు. అక్రమ ఇసుక, మైనింగ్, భూదందాల పేరుతో ఆర్థికంగా సంపాదించుకొని రాజకీయంగా బలపడి అచ్చంపేటలో మల్టీస్పెషాలిటీ దవాఖాన నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి నీచమైన పనులకు పాల్పడుతున్న ఎమ్మెల్యే పనితీరును అచ్చంపేట ప్రజలు గమనిస్తున్నారని, వారికి తగిన సమయంలో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అవిశ్వాసంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విప్ జారీ చేస్తే ఈ పత్రాలను తీసుకొని మా పార్టీ నేతలు ఆర్డీవో కార్యాలయానికి వెళ్తే ఆర్డీవో మాధవి కావాలని కార్యాలయానికి రాకుండా, ఫోన్లు ఎత్తకుండా మధ్యాహ్నం 12గంటలకు కార్యాలయానికి వచ్చారని ఇందులో మొదటి ముద్దాయి ఆర్డీవోనే అన్నారు. రెండోవార్డు కౌన్సిలర్ సుంకరి నిర్మలాబాలరాజుపై దాడిచేసి, కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేసి అచ్చంపేట ఎస్సై దగ్గరుండి కాంగ్రెస్ క్యాంప్‌నకు పంపించారని విమర్శించారు. తనను అచ్చంపేటలో కాలుపెట్టనివ్వకుండా ఎమ్మెల్యే, ఆయన అనుచరులు మాట్లాడుకుంటున్నారని, తనకు రక్షణ కావాలని స్వయంగా డీజీపీకి కలిసి విన్నవించామన్నారు. ఇంటలిజెన్స్‌శాఖ నుంచి ఫోన్లు చేసి అచ్చంపేటలో మీకు ప్రాణహాని ఉందని ఎక్కువగా వెళ్లవద్దని చెబుతున్నారే తప్పా రక్షణ కల్పించడం లేదన్నారు. ఉద్యమాలు మాకు కొత్తకాదని ప్రజల కోసం, పార్టీ శ్రేణుల కోసం ప్రాణాలర్పించేందుకు సిద్ధమని ప్రకటించారు. కాంగ్రెస్ దాడులు, కేసులకు భయపడే నైజం తనది కాదన్నారు. కాంగ్రెస్ ప్రలోభాలకు లొంగకుండా పార్టీ కోసం నిలబడిన నర్సింహాగౌడ్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు రమేశ్‌రావు, మన్నుపటేల్, ఖాజాకుత్బుద్దీన్‌కు ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నర్సింహాగౌడ్, సీనియర్ నేత కేటీ తిరుపతయ్య, కౌన్సిలర్లు రమేశ్‌రావు, ఖాజాకుత్బుద్దీన్, జెడ్పీటీసీ రాంబాబు, చెన్నకేశవులు, అమీనొద్దీన్, శంకర్‌మాదిగ, సురేశ్, మాజీ సర్పంచ్ బొడ్కానాయక్, రంగాపూర్ వెంకటయ్య, వంశీనాయక్, రానోజీ, శ్రీను, అల్లెశ్రీనివాసులు, రాము, పెంటయ్య, నిరంజన్, బాబు, రాకేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న గువ్వల బాలరాజు, పార్టీ శ్రేణులు

# జూరాలకు పెరుగుతున్న వరద

ధరూరు, జూన్ 13 : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద పెరుగుతున్నది. ఎగువన కురుస్తున్న వర్షాలకు ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి వరద చేరుతుండడంతో రోజురోజుకు జూరాల నీటి మట్టం క్రమంగా పెరుగుతున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 318.516 మీటర్లకు గానూ ప్రస్తుతం 317.020 వరకు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

**ఆర్డీఎస్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో..**

అయిజ, జూన్ 13 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో స్వల్పంగా కొనసాగుతున్నది. ఎగువన కురుస్తున్న వర్షాలకు 5,455 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, అవుట్ ఫ్లో 5,455 క్యూసెక్కులు దిగువన ఉన్న సుంకేసుల బ్యారేజీకి చేరుతుందని ఆర్డీఎస్ ఏఈ రాందాస్ తెలిపారు. ప్రస్తుతం ఆనకట్టలో 8.4 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

**తుంగభద్ర డ్యాంకు..**

తుంగభద్ర డ్యాంకు వరద కొనసాగుతున్నది. ఇన్‌ఫ్లో 3,215 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 10క్యూసెక్కులుగా నమోదైంది. టీబీ డ్యాం 100.855 గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 5.590 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. 1,633 అడుగుల పూర్తిస్థాయి నీటి మట్టానికి గానూ ప్రస్తుతం 1582.13 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు టీబీ డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.





మహబూబ్‌నగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు, నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ఎదుట మాట్లాడుతున్న కార్యకర్తలు

# సమస్యలు పరిష్కరించాలి

- ప్రత్యేక పరీక్ష విధానాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి
- కలెక్టరేట్ల వద్ద ఆశవర్కర్ల నిరసన

మహబూబ్‌నగర్ అర్బన్/నాగర్‌కర్నూల్‌టౌన్/ గద్వాల అర్బన్, జూన్ 13 : ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్ల ఎదుట గురువారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్తలు మాట్లాడుతూ ఆశ వర్కర్లును తొలగించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆశ కార్యకర్తలకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి నియమించుకోవాలని చూస్తున్నదని, ఆ ఆలోచనను తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. అదేవిధంగా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశ కార్యకర్తలకు ఇస్తున్న పారితోషికాన్ని రూ.18 వేలకు పెంచాలని, రూ.50 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలు చెల్లించడంతోపాటు పింఛన్ సౌకర్యం కూడా కల్పించాలని, ప్రతి నెలా 2వ తేదీన పారితోషికం అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయా జిల్లా కలెక్టరేట్ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమాల్లో ఆశ వర్కర్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కళావతమ్మ, సీఐటీయూ మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి కురుమూర్తి, నాగర్‌కర్నూల్ సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆంజనేయులు, శ్రీనివాస్, నాయకులు మల్లేశ్, అశోక్‌తోపాటు ఆయా జిల్లాల ఆశ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.